
గత యేడు కురిసిన భారీ వర్షానికి తెగిపోయిన మోరంచవాగు వంతెన


ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలమయమైన మహబూబాబాద్ పట్టణం

మేడారం అడవుల్లో టోర్నడోలకు నేలమట్టమైన అడవి

ప్రకృతి కన్నెర్ర

- క్లౌడ్ బరస్ట్, టోర్నడోలతో అల్లకల్లోలం
- మహబూబాబాద్ జిల్లాను ముంచెత్తిన భారీ వరదలు
- గతేడాది భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఇదే దుస్థితి
- తాడ్వాయి - మేడారం అడవుల్లో సుడిగాలుల బీభత్సం
- టోర్నడోలతో అడవుల్లో లక్షలాది చెట్లు నేలమట్టం
- 2019లో ఏటూరునాగారం అభయారణ్యంలో ఊళ్లను కమ్మేసిన మేఘాలు
- ఆందోళనకు గురవుతున్న ప్రజలు.. నిగ్గు తేల్చేపనిలో అధికారులు..

5

అసాధారణ విపత్తులతో 'ఓరుగల్లు'లో అలజడి

- ఆకాశంలో ఎంతో ఎత్తున ఉండాల్సిన మేఘాలు.. చెట్లను, ఊళ్లను తాకడమేమిటి?.. ఇది ములుగు జిల్లా ఏటూరునాగారం అభయారణ్యంలో 2019లో జరిగింది. ఆ నాడు ఊళ్లను, చెట్లను తాకుతూ మేఘాలు వెళ్లాయి. దీంతో సమీప గ్రామాల ప్రజలు సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు. అధికారులు ఏమీ పట్టనట్టు వదిలేశారు.
- యేడాది మొత్తంలో కురవాల్సిన వాన.. ఒక్క రోజులో పడడమేమిటి? 2023 జూలై 27న ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో రికార్డు స్థాయిలో 64.98 సె.మీ. వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి జిల్లా చిట్యాలలో 61.65 సెం.మీలు, గణపురంలో 47.58 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షం ధాటికి వరదలు ఉప్పొంగాయి. దీంతో తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. దీనిని క్లౌడ్ బరస్ట్‌గా వాతావరణవేత్తలు చెబుతున్నారు.
- ఆగస్టు 31వ తేదీన సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ములుగు జిల్లా తాడ్వాయి - మేడారం అడవుల్లో ఒక్కసారిగా భారీ అలజడి చెలరేగింది. పెద్దఎత్తున గాలిదుమారం, సుడిగాలులతో మేడారం అడవుల్లో మహావృక్షాలు సైతం చిగురాటకులా వణికిపోయాయి. ఈ భారీ గాలికి సుమారు 50వేలకు పైగా చెట్లు ఒకే తీరుగా కుప్పకూలిపోయాయి. గాలుల ధాటికి సమీప గ్రామాల్లోని ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి.
- ఈ నెల సెప్టెంబరు 1వ తేదీన మానుకోటను వర్షాలు ముంచెత్తాయి. అత్యధికంగా 29.67 సె.మీ. వర్షం పడింది. కుండపోత వానతో ఆకేరు, మున్నేరువాగుల్లో ప్రవాహం పెరగటంతోపాటు రైల్వేట్రాక్‌లు కూడా ధ్వంసమయ్యాయి. సైంటిస్ట్ అశ్విని తన తండ్రి మోతీలాల్‌తో సహా వరదలో కొట్టుకుపోయి మృతి చెందారు.

.. ఇలా.. కొన్నేళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరుగుతున్న అసాధారణ విపత్తులపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి ఏం కారణమై ఉంటుందని అనుమానపడుతున్నారు. ఏజెన్సీల్లో ఏర్పడిన సుడిగాలులపై అటవీశాఖాధికారులు విచారణ చేస్తున్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) ద్వారా శోధిస్తున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాను వణికిస్తున్న క్లౌడ్‌బరస్ట్, టోర్నడోలపై ప్రభుత్వం విస్తృత పరిశోధనలు జరపాలని ఓరుగల్లు ప్రజలు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

బల్దియాలో నేడు ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 8: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులు పరిష్కరించి తగినపరిష్కారం చూపిస్తారని కమిషనర్ తెలిపారు.


మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ కావ్య

వైద్యరంగ బడ్జెట్ పెంపునకు కృషి చేస్తా..

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ఘనంగా ఐఎంఏ జోన్-3 రాష్ట్ర సదస్సు

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 8: వైద్య రంగానికి కేటా యిస్తున్న రెండు శాతం బడ్జెట్‌ను పెంచేందుకు లోక్‌సభలో ప్రస్తావిస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. వరంగల్ నగరంలోని వజ్రా గార్డెన్స్‌లో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ జోన్-3 రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఐఎంఏ ఆధ్వర్యంలో 'ప్రజారోగ్యం - ప్రభుత్వ విధానాలు, నకిలీ వైద్యులు-దుష్పరిణామాలు, వైద్య సిబ్బం దిపై దాడులు-నివారణ చర్యలు, యువ వైద్యుల ఆకస్మిక మరణాలు-కారణాలు' అనే అంశాలపై చర్చా వేదిక నిర్వహిం చారు. ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి విశిష్ట అతిథి ఎంపీ కావ్య మాట్లాడుతూ.. వైద్యుల సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజారోగ్య పరిరక్షణ, నకిలీ వైద్య వ్యవస్థ నిర్మూలన జరగాలన్నారు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో ప్రజల సంక్షే మం కోసం 24 గంటలు పని చేస్తున్నా, వైద్యులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు చొరవ చూపడం లేదన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలు పెంచినప్పటికీ వారికి బోధించే వారి సంఖ్య సరిపోవడం లేదని, దీని వల్ల క్వాలిటీ వైద్యులు తగ్గుతారన్నారు. వైద్యులకు జీతాలు పెంచాలని జాతీయ ఐఎంఏకు తెలిపినా ఇప్పటి వరకు స్పష్టత రాలేదన్నారు. అనంతరం తెలంగాణ నుంచి జాతీయ ఐఎంఏ అధ్యక్షుడైన దిలీప్‌బన్సాలిని ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ నరేష్‌కుమార్, డాక్టర్ సుదీప్, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్‌మియా, కోశాధికారి శ్రవణ్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అజిత్, వెంకటస్వామి పాల్గొన్నారు.

సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి


హెలికాప్టర్లో హైదరాబాద్ వెళ్తున్న మంత్రులు

మరిపెడ, సెప్టెంబరు 8: ఎడతెరపిలేని వర్షాలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నందున మహబూబాబాద్ జిల్లా అధికార యంత్రాంగం సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్ అద్వైత్‌సింగ్ కుమార్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌కు సూచించారు. ఆదివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఖమ్మం జిల్లాలోని వరద ముంపు ప్రాంతాలను సందర్శించి తిరుగు ప్రయాణంలో అక్కడి అధికారులు వారి ప్రయాణానికి చేరువగా ఉండేందుకు మరిపెడ దగ్గర ఉన్న హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్‌ను సిద్ధం చేసి ఉంచారు. ఖమ్మం పర్యటన అనంతరం వారు హెలికాప్టర్లో హైదరాబాద్ వెళ్లేందుకు మరిపెడ హెలిప్యాడ్‌కు ప్రత్యేక వాహనాల ద్వారా చేరుకోగా, మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌సింగ్‌కుమార్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. మహబూబాబాద్ జిల్లాలోని వర్షం పరిస్థితులను కలెక్టర్, ఎస్పీని వారు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి వరద ముంపు బాధితులకు అందిస్తున్న సహాయక చర్యలపై మంత్రులకు వివరించారు. కేంద్ర మంత్రి వెంట మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, చేవేళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఉన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్, కాంగ్రెస్ నేతలు నరేశ్‌రెడ్డి, యుగేంధర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, అంబరీష, అఫ్జల్, తాజుద్దీన్, వేణు, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. కిషన్‌రెడ్డిని ఇక్కడి బీజేపీ నేతలు గంగాధర్, లింగంనాయక్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.





ఎల్లంబజార్‌లో ఏర్పాటు చేసిన 40 ఫీట్ల భారీ గణపతి

జయ జయ వినాయక..

- కొలువుదీరిన గణనాథులు
- వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 8: గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. శనివారం వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగ వేళ మట్టి గణపతులను ఇళ్లల్లో పెట్టుకొని వివిధ పత్రాలతో పూజించి, పిండివంటలు నైవేద్యంగా సమర్పించారు. స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు, వ్యాపార సంస్థలు మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. నర్సంపేట, వర్ధన్నపేట మండలాలైన ఖానాపూరం, చెన్నారావుపేట, నెక్కొండ, దుగ్గొండి, నల్లబెల్లి, గీసుగొండ, పర్వతగిరి, రాయపర్తి, సంగెం మండలాల్లో, గ్రామాల్లో, వాడవాడలా, పండుగను జరుపుకున్నారు. వరంగల్‌లోని ఎల్లంబజార్ ప్రాంతంలో 40 అడుగుల మట్టి గణపతిని ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని చూడటానికి స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.కాకతీయ సినిమా థియేటర్ సమీపంలో 1500 కిలోల భారీ లడ్డూను ఏర్పాటు చేయడం విశేషం. వరంగల్ చౌరస్తాలోని బంగారు వర్తక సంఘం ఆధ్వర్యంలో, బట్టల బజార్‌లోని బట్టల వర్తకం ఆధ్వర్యంలో, జేపీఎన్ రోడ్డులోని గీతా భవన్ వద్ద గణపతి, కొండూరు వారి వీధిలో కాకతీయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, దుర్గేశ్వరాలయం వద్ద, రామన్నపేటలోని శ్రీసీతారామ కల్యాణ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన గణనాథులు ఆట్టుకున్నాయి. భద్రకాళి ఆలయం, ఎంజీఎం సెంటర్ రాజరాజేశ్వరి దేవాలయం, శృంగేరి శంకర మఠం, ఆకారపు వారి గుడి, రామలింగేశ్వరాలయం, ములుగు రోడ్‌లోని దత్తక్షేత్రంలో గణనాథులకు పూజలు నిర్వహిస్తున్నారు. పిన్నవారి వీధిలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అయోధ్య బాల రామాలయం సెట్టింగ్ ఆకర్షిస్తోంది. మండపాల వద్ద విద్యుత్ లైట్ల అలంకరణలతో అందంగా తీర్చి దిద్దారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.


వరంగల్‌లో కొండూరు వారి వీధిలో ఏర్పాటైన వినూత్న వినాయకుడు

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



ఉత్తమ సేవలందించిన వారిని శాలువాలతో సన్మానిస్తున్న రెడ్డి సంఘం నేతలు

జూలైవాడ, సెప్టెంబరు 8 : విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ పోస్టల్ కాలనీలోని రెడ్డి సంఘం కార్యాలయంలో ఉత్తమ సేవలు అందించిన విద్యుత్ రంగంలో డివిజనల్ ఇంజనీర్ సాంబరెడ్డి, వైద్యరంగంలో యూరాలజిస్టు డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి, రా రైస్ మిల్లర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పాడి గణపతిరెడ్డి, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న బొమ్మినేని సంధ్యారెడ్డి, ఇటీవల ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన కామిడి సతీష్‌రెడ్డిలను రాష్ట్ర రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, నల్లా రాజిరెడ్డి, నరసింహారెడ్డి, సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, రమేందర్‌రెడ్డి, కేశవరెడ్డి, సతీష్‌రెడ్డి, రమణారెడ్డి, తిరుపతిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, చందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

15న మిలాద్ ఉల్ నబీ వేడుకలు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 8 : హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్లో ఈనెల 15న రాత్రి 8 నుంచి ఉదయం 5 గంటల వరకు మిలాద్ ఉల్ నబీ వేడుకలు అత్యంత ఘనంగా జరుగుతాయని మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు ఖాజా సిరాజొద్దీన్ తెలిపారు. శనివారం రాత్రి హనుమకొండలోని బర్కాతియా మదర్‌సాలాలో మర్కజీ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో జష్నే మిలాద్ ఉల్ నబీ వేడుకల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిరాజొద్దీన్ మాట్లాడుతూ.. ఈ వేడుకల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇస్లాం పండితులు హాజరవుతారని, త్రినగరిలోని ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ బాధ్యులు ఎం.డి. నయీం, అఫ్జల్ బర్కాతి, షఫీ, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మిలాద్ ఉల్ నబీ వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లిం మత పెద్దలు

నిత్య చైతన్యమూర్తి కాళోజీ

- ప్రజల గొడవే.. తన గొడవ..
- పౌరహక్కుల ఉద్యమ నేత
- నేడు కాళోజీ 110వ జయంతి
- నేడు మాండలిక భాషా దినోత్సవం
- కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం వాయిదా

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 8 : అసమ్మతి నిరసనల ధిక్కార స్వరం.. మానవత్వపు మనుగడకు నిలువెత్తు సంతకం.. ఈ కాలపు వేమన.. పౌర హక్కుల వాది.. ఉద్యమ జీవి ప్రజాకవి కాళోజీ నేటి సమకాలీన సమాజానికి ఆయన నా గొడవ ద్వారా అందించిన సాహిత్యం నిత్య చైతన్యం. ఈ నెల 9వ తేదీన 110 వసంతాలు పూర్తవుతాయి. ఆయన జయంతిని తెలంగాణ ప్రజలు మాండలిక భాషా దినోత్సవం గాను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రజా కవి కాళోజీ పేరిట ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చినా ఇంకా కొన్ని పనులు మిగిలిపోయాయి. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరిగే ఈ కళాక్షేత్రం ప్రారంభోత్సవం వచ్చే నెలకు వాయిదా పడింది. అయినా కాళోజీ అభిమానులు, కాళోజీ ఫౌండేషన్ సోమవారం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం కూడా పదేళ్లుగా కాళోజీ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యా సంస్థల్లో అయన జయంతి వేడుకలు సోమవారం జరుగనున్నాయి. ఈసారి కాళోజీ స్మారక అవార్డును బహుముఖ భాషా వేత్త కరీంనగర్‌కు చెందిన నలిమెల భాస్కర్‌కు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

110వ జయంతి..

1914 సెప్టెంబరు 9న జన్మించిన కాళోజీ పూర్తి పేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాస్‌రావు. మడికొండలో స్థిరనివాసం ఏర్పర్చుకొని వరంగల్ కేంద్రంగా ఆయన జీవితమే సాహిత్యం, ఉద్యమం ద్వారా కొనసాగించారు. మడికొండలో ప్రాథమిక విద్య, సెకండ్ పారం హనుమకొండ, హైదరాబాద్ పాతబస్తీలో కొనసాగింది. పదో తరగతి వరకు హనుమకొండలోని ప్రస్తుత కాలేజీయేట్ హైస్కూల్‌లో పూర్తి చేశారు. ఆర్య సమాజ ఉద్యమం, పౌరహక్కులు, సాహిత్యంతో ఆయన జీవితం పెనవేసుకుపోయింది. ఆయనను ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో పీవీ నర్సింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు సత్కరించింది. 1958 నుంచి 1960 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడిగా, ఆంధ్ర సారస్వత పరిష్యత్ సభ్యుడిగా సాహిత్య అకడమిక్ సభ్యుడిగా, తెలంగాణ రచయితల మండలి అధ్యక్షుడిగా, హనుమకొండలో మిత్రమండలి వ్యవస్థాపకుడిగా పనిచేశారు. 'నా గొడవ'తో పాటు 'బాపు.. బాపు.. బాపు..' 'కాళోజీ కథలు', 'నా భారతదేశ యాత్ర', 'కాళోజీ తెలంగాణ ఉద్యమ కవిత'ల లాంటి సుమారు 20 గ్రంథాలను వెలువరించారు. కాళోజీ జీవన రేఖలో సాహిత్యం, ఉద్యమాలు మాత్రమే ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.



అవనిపై జరిగేటి అవకతవకలు చూసి..
ఎందుకో నా హృదిని ఇన్ని వేదనలు..
పరుల కష్టం చూసి పగిలిపోవును గుండె..
మాయ మోసమును చూసి చితికిపోవును మనసు..
ఎందుకో నా హృదికి ఇన్ని ఆవేదనలు..

.. అంటూ సమాజంలోని ఎన్నో వేదలను నా గొడవగా చిత్రీకరించిన మనిషి కాళోజీ. అసమ్మతి, నిరసన, ధిక్కార స్వరం మానవత్వపు మనుగడకు నిలువెత్తు సంతకం కాళోజీ ఒక కాలేజీ అన్నది అక్షర సత్యం. అక్షర యోధుడు ఈ కాలపు వేమన, పౌరహక్కుల చైతన్య మూర్తి, ఉద్యమ జీవి, వీటన్నింటికీ చిరునామాయే కాళోజీ. ఆయన కలం నుంచి జాలువారిన అక్షర తూటాలవలె ప్రతీ తెలుగు వారి హృదిలో ముద్రితమై ఆలోచనలను కలిగింపజేస్తాయి.

తెలుగు బిడ్డవురోరి.. తెలుగు మాట్లాడుటకు..
సంకోచపడియెదవు.. సంగతేమిటిరా..?
అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదనుచు..
చకిలించు ఆంధ్రుడా.. చావవెందుకురా..?

.. అంటూ మాతృ భాషపట్ల ఆయన మమకారం చాటుతూ తెలుగును చిన్న చూపుతూ పరభాష వ్యామోహంతో కూరుకుపోయిన వారిని సూటిగా ప్రశ్నిస్తూ ఏనాడో కవిత్వం రాసిన ఆయన సాహిత్యం నిత్య నూతనం. అందుకే ఆయన జన్మదిన వేళ తెలుగు మాండలిక దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ.

అన్నపు రాసులు ఒకచోట.. ఆకలి మంటలు ఒకచోట..
హంసతూలికలు ఒకచోట.. అలసిన దేహాలు ఒకచోట ..
కమ్మని సకినాలు ఒకచోట.. గట్టి దవడలు ఇంకోచోట..

.. అని సమాజంలో తరతమ వ్యత్యాసాలను ఎండగడుతూ గుభాళింప చేసిన కాళోజీ సాహిత్యమంతా నిత్య చైతన్యం. ఒక శతాబ్ద కాలపు తెలంగాణ సామాజిక రాజకీయచరిత్ర అంతా ఆయన సాహిత్యమే. పలుకుబడుల భాషా కావాలని పట్టుబట్టిన కాళన్న జయంతిని తెలుగు మాండలిక భాషా దినోత్సవం గాను జరుపుకుంటూ ఆయన అభిమానులు ఆయనను స్మరించుకోవడం ఆనవాయితీ.

రోలర్ స్కేటింగ్‌లో ఐషా ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 8: మడికొండ రాంపూర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్‌లో పోటీలలో హనుమకొండ నయీంనగర్‌కు చెందిన ఐషా మరియం స్వర్ణ పతకాలు కొల్లగొట్టి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. జిల్లా స్థాయి అండర్-5, 7 బాలికల 400, 600 మీటర్ల స్పీడ్ క్వాడ్ స్కేట్స్ విభాగంలో ఐషా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రెండు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించి అక్టోబర్ నెలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరక రోలర్ స్కేటింగ్ పోటీలలో స్వర్ణ పతకాలు సాధించిన ఐషాను మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అభినందించారు.



ఐషాను అభినందిస్తున్న వినయభాస్కర్

విద్యుత్ పునరుద్ధరణ పనులు
వేగవంతం చేయాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి
- ఖమ్మం, మహబూబాబాద్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 8: వర్షాలతో విద్యుత్ సామగ్రి దెబ్బతిన్న ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులను వేగవంతంగా చేయాలని మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల విద్యుత్ అధికారులను సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. వర్షాల కారణంగా విద్యుత్ సంస్థకు భారీగా నష్టం వాటిల్లిన మహబూబాబాద్, ఖమ్మం జిల్లా అధికారులతో సీఎండీ ఆదివారం హనుమకొండ కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. మహబూబాబాద్ సర్కిల్‌లో భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న డోర్నకల్, గార్ల, కొత్తపేట, సిరోల్, మరిపెడ, చిన్న గూడూరులో పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, అదనపు కాంట్రాక్టర్లను నియమించుకోవాలని ఆదేశించారు. కంపెనీ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని, వీలైనంత త్వరంగా పూర్తి చేయాలన్నారు. మిగతా వింగ్‌లల్లో పనిచేసే ఏడీఈ, ఏఈలను పునరుద్ధరణ పనులల్లో ఉపయోగించుకోవాలన్నారు. వాగుల నుంచి 500 మీటర్ల దూరంతో 9.1 మీటర్ల స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. గుండ్రాతిమడుగు, మరిపెడ-1,2. చిన్నగూడూరు ఫీడర్ల వద్ద పురోగతిలో ఉన్న 33 కేవీ లైన్ పనులను పర్యవేక్షించాలని సీఈ కన్‌స్ట్రక్షన్, డీఈ ఎంఆర్‌టీ, కన్‌స్ట్రక్షన్‌లను ఆదేశించారు. ఖమ్మం సర్కిల్‌లో దెబ్బతిన్న కూసుమంచి, పాలేరు, ముదిగొండ, పమ్మి, ఆరెంపుల, పల్లెగూడెం, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, ప్రకాశ్‌నగర్ సెక్షన్‌లల్లో పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ వీసీలో ఇన్‌చార్జి డైరెక్టర్ (ఆపరేషన్) టి.మధుసూదన్, సీజీఎంలు కిషన్, అశోక్, బికంసింగ్, జీఎంలు నాగప్రసాద్, అన్నపూర్ణ, ఎస్ఈ అంకుష్ పాల్గొన్నారు.

అవినీతి రహిత సేవలందించేందుకు కృషి

ఎన్పీడీసీఎల్ పరిధిలో అవినీతి రహిత సేవలందించేందుకు కంపెనీ నిబద్ధతతో పని చేస్తుందని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. వినియోగదారులకు సేవలందించే విషయంలో ఇబ్బందులు కల్గించే, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ఉద్యోగులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. విద్యుత్ సిబ్బంది సేవలకు ఫలితంగా లంచం అడిగితే విజిలెన్స్ వింగ్ ఆధ్వర్యంలో పర్యవేక్షించబడుతున్న ఫోన్ నెంబర్ 9281033233, టోల్‌ఫ్రీ నెంబర్ 1064 నెంబర్‌కు వినియోగదారులు ఫిర్యాదు చేయాలన్నారు. లంచం అడిగితే మాకు సమాచారం ఇవ్వండంటూ ఇప్పటికే 16 సర్కిళ్ల పరిధిలో పోస్టర్ల అతికించామన్నారు. సిటిజన్ చార్టర్‌కు లోబడి వినియోగదారులకు సేవలందించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడానికి 'ఎన్పీడీసీఎల్ గ్రీవెన్స్ పోర్టల్' అనే ప్రత్యేక పోర్టల్ పెట్టడం జరిగిందని పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కరించుకొవచ్చని సూచించారు.

నేటి కేయూ పరిధిలోని పరీక్షలన్నీ వాయిదా

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 8: భారీ వర్షాల నేపథ్యంలో సెప్టెంబరు 9న కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని జరగాల్సిన పరీక్షలన్నీ వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి ఆదివారం ప్రకటించారు. బీఫార్మసీ రెండో సెమిస్టర్‌తోపాటు ఇతర పరీక్షలన్నీ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తిరిగి ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని వెల్లడించారు. కాగా, సెప్టెంబరు 10వ తేదీన మంగళవారం నుంచి జరగాల్సిన పరీక్షలన్నీ యథావిధిగా జరుగుతాయని స్పష్టం చేశారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 8: వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి యుగేంధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా స్థాయిలో అండర్-8. 10, 12, 14, 16, 18, 20 సంవత్సరాల బాలబాలికలకు వివిధ విభాగంలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు వెంట తీసుకొని ఈ నెల 10న ఉదయం 9గంటలకు హనుమకొండ జేఎన్ఎస్‌లో హాజరు కావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9866564422 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రకృతి కన్నెర్ర!

- అసాధారణ విపత్తులతో 'ఓరుగల్లు'లో అలజడి
- క్లౌడ్ బరస్ట్, టోర్నడోలతో అల్లకల్లోలం
- ఆందోళనకు గురవుతున్న ప్రజలు.. నిగ్గు తేల్చే పనిలో అధికారులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



గతేడాది జూలై 27న వరదతో మునిగిపోయిన మోరంచపల్లి (ఫైల్)



మేడారం అడవుల్లో టోర్నడోలకు నేలమట్టమైన అడవి

ఓరుగల్లుపై ప్రకృతి పగ పట్టిందా..? కొన్నాళ్లుగా ఉత్పన్నమవుతున్న అసాధారణ విపత్తులు దేనికి సంకేతాలు..? మేఘాలు ఊళ్లను కమ్మేయటం వెనుక రహస్యమేమిటి..? క్లౌడ్ బరస్ట్, టోర్నడోల బీభత్సం హెచ్చరికల మర్మమేటి..? అసలేం చెబుతోంది ప్రకృతి..?

..ఇప్పుడిదే ఓరుగల్లులో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దేశంలో ఎక్కడాలేని విధంగా ములుగు జిల్లా మేడారం అడవుల్లో టోర్నడోల బీభత్సం భయాందోళనకు గురి చేస్తోంది. 2019లో ఏటూరునాగారం అభయారణ్యంలో ఊళ్లను, చెట్లను తాకుతూ వెళ్లిన మేఘాల మర్మం తెలియక ముందే టోర్నడోల అలజడి ఆందోళన కలిగిస్తోంది. ఏటా ఏదో ఒక జిల్లాలో రికార్డు స్థాయిలో క్లౌడ్‌బరస్ట్ తరహాలో కురుస్తున్న వానలతో తీవ్రంగా ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లుతున్నాయి. గతేడాది భూపాలపల్లి, ములుగు జిల్లాలను అతలాకుతలం చేసిన వానలు.. ఈసారి మానుకోటను ముంచెత్తాయి. ప్రకృతిలో మార్పులే ఈ విపత్తుకు కారణమైతే.. ఆ మార్పులకు ఓరుగల్లే కేంద్రం ఎందుకవుతోందనేది చర్చనీయాంశంగా మారింది.

క్లౌడ్ బరస్ట్ కలకలం

ఆకాశానికి చిల్లు పడినట్లుగా వర్షం మొత్తం ఒకే చోట కుప్పగా పడటమే క్లౌడ్ బరస్ట్. గత ఏడాదికి ముందు ఈ పదం చాలామందికి తెలియదు. 2023 జూలైలో కురిసిన భారీ వర్షాలతో భూపాలపల్లి, ములుగు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. గత ఏడాది జూలై 27వ తేదీన తెలంగాణ చరిత్రలోనే తొలిసారిగా ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో రికార్డు స్థాయిలో 64.98 సెం.మీ వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి జిల్లా చిట్యాలలో 61.65 సెం.మీలు, గణపురంలో 47.58 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఒక ఏడాదంతా పడాల్సిన వాన.. ఒకేచోట ఒకేసారి కుమ్మరించినట్లుగా పడటంతో వాగులు, చెరువులు వాన తాకిడిని తట్టుకోలేకపోయాయి. ఫలితంగా వరద ప్రవాహం పెరిగింది. దీంతో మోరంచవాగు ఉప్పొంగటంతో నలుగురు వాగులో గల్లంతయ్యారు. ములుగు జిల్లా కొండాయిలో వాగులో ఆరుగురు కొట్టుకుపోయారు. వెంకటాపూర్ సమీపంలో బూర్గుపేట చెరువు అలుగులో ఇద్దరు కొట్టుకపోయారు. భూపాలపల్లి జిల్లాలో సుమారు 20 మందికి వరకు వరదలకు మృత్యువాతపడ్డారు. వేలాది పశువులు మృతి చెందగా, వేలాది ఎకరాల పంట పొలాలు దెబ్బతిన్నాయి.

వరంగల్ నగరంలోనూ భారీ వర్షాలతో 70కి పైగా కాలనీలు నీట మునిగాయి. ఎప్పుడూ లేని విధంగా వరంగల్ నగరాన్ని కూడా గతేడాది వానలు ముంచెత్తాయి. గత ఏడాది జరిగిన వరద దుర్ఘటన నుంచి ఇంకా బయట పడక ముందే ఈ ఏడాది మానుకోట జిల్లాను క్లౌడ్‌బరస్ట్ కకావికలం చేసింది. సెప్టెంబరు 1వ తేదీన మానుకోటలో అత్యధికంగా 29.67 సెం.మీ. వర్షం పడింది. నర్సింహులపేటలో 40.56 సెం.మీ., కేసముద్రంలో 37.72 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, దంతాలపల్లి, కురవి మండలంలో 35.42 సె.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. కుండపోత వానతో ఆకేరు, మున్నేరువాగుల్లో ప్రవాహం పెరగటంతోపాటు రైల్వే ట్రాక్‌లు కూడా ధ్వంసమయ్యాయి. సైంటిస్ట్ అశ్విని, తండ్రి మోతీలాల్‌తో సహా వరదలో కొట్టుకపోయి మృతి చెందారు. ఒక్కసారిగా రాత్రికి రాత్రే క్లౌడ్ బరస్ట్‌తో వరదను అంచనా వేయలేకపోతున్నారు. వరుసగా గతేడాది నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు ఒకే చోట పడుతుండటం వాతావరణ మార్పులే కారణమని చెప్పుతున్నారు.

దీనికంటే ముందు 2019లో ఏటూరునాగారం అభయారణ్యం పనిధిలోని ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం ప్రాంతాల్లో ఆకాశంలో ఉండాల్సిన మేఘాలు ఊళ్లలోని ఇళ్లపై వరకు వచ్చాయి. నల్లని మబ్బులు ఇళ్లను తాకే వరకు రావటంతో అప్పట్లోనే క్లౌడ్ బరస్ట్ అవుతుందని అందరూ భయాందోళనకు గురయ్యారు. అయితే అప్పట్లో తప్పిన 2023, 2024ల్లో ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలో క్లౌడ్‌బరస్ట్‌తో వరద బీభత్సాన్ని సృష్టిస్తోంది.

ఏజెన్సీలో టోర్నడోల అలజడి

దేశంలోనే ఎక్కడాలేని విధంగా సుడిగాలుల బీభత్సం ఏజెన్సీని వణికిస్తోంది. ఆగస్టు 31వ తేదీన సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ములుగు జిల్లా తాడ్వాయి - మేడారం అడవుల్లో ఒక్కసారిగా భారీ అలజడి చెలరేగింది. పెద్దఎత్తున గాలి దుమారం, సుడిగాలులతో మేడారం అడవుల్లో మహావృక్షాలు సైతం చిగురుటాకులా వణికిపోయాయి. ఈ భారీ గాలికి ఒకటి కాదు.. రెండు వందలు కాదు.. ఏకంగా సుమారు 50వేలకు పైగా చెట్లు ఒకే తీరుగా కుప్పకూలిపోయాయి. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుండగా, అనూహ్యంగా ఏటూరునాగారం అభయారణ్యంలోని దొడ్ల కొత్తూరు అడవుల్లో ఏడు కిలోమీటర్ల మేర 5హెక్టార్లకు పైగా టోర్నడోలతో లక్షలాది చెట్లు నేలమట్టమైనట్లు ఆదివారం అటవీశాఖ అధికారులు గుర్తించారు. దీంతో తాడ్వాయి అడవుల్లో సుడిగాలుల బీభత్సంతో లక్షలాది చెట్లు నేలకూలిపోవటం ఆదివాసీలను ఆందోళనకు గురిచేస్తోంది. అయితే టోర్నడోల వల్ల ఒకస్పష్టమైన మార్గంలో సాగే బలమైన గాలుల ధాటికి చెట్లు నేలమట్టం అయ్యాయని అటవీశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో గాలుల వేగం గంటకు 120 కిలోమీటర్లకు పైనే ఉంటుదని, అంతేవేగంగా సుడులు తిరిగినట్లుగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ టోర్నడోలు సాంకేతికంగా అనేక కారణాలవల్ల ఏర్పడుతుందని, వీటిలో అధికవేగంతో కూడిన గాలులు, అవి సంభవించే మార్గంలో అనేకచెట్లు కూలిపోతాయని, అయితే మన దేశంలో ఇలాంటి సంఘటనలు చాలా అరుదని నిపుణులు చెబుతున్నారు.

విపత్తులకు కారణమేమిటి..?

ఉమ్మడి వరంగల్‌జిల్లాలో అసాధారణంగా ఏర్పడుతున్న విపత్తులకు కారణాలేమిటి అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. చరిత్రలో అత్యధికంగా 2023 జూలై 27న ములుగు జిల్లా లక్ష్మీదేవపేటలో క్లౌడ్ బరస్ట్‌తో 64.98 సెం.మీ.ల వర్షం కురిసింది. ఆగస్టు 31న టోర్నడోలతో తాడ్వాయి అడవుల్లో రెండు ప్రాంతాల్లో రెండు లక్షలకు పైగా చెట్లు నేలమట్టం అయ్యాయి. ప్రకృతి ఓరుగల్లుపైనే ఎందుకు కన్నెర్ర చేస్తోందనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే టోర్నడోలపై అటవీశాఖ అధికారులు శాటిలైట్ డేటాను సేకరిస్తున్నారు. ఈ ప్రాంతంలోనే టోర్నడోలు ఎందుకు వస్తున్నాయో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో పాటు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ)ని కూడా సంప్రదిస్తున్నారు. కోట్లాది మంది భక్తులకు ఇలవేల్పుగా ఉన్న మేడారం సమక్క, సారలమ్మ కొలువైన మేడారం అడవుల్లోనే టోర్నడోలు రావడంపై ఆందోళన చెందుతున్నారు. ఈ బలమైన సుడిగాలులు జాతర సమయంలో వస్తే భారీగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుందనే చర్చ జరుగుతోంది. 2019లో ఏటూరునాగారం అభయారణ్యంలో మేఘాలు ఊళ్లలో ఇంటిపై వరకు వచ్చినప్పుడే పరిశోధనలు చేస్తే ఇప్పటికే కొంత సమాచారం సేకరించేవారని, అప్పట్లో ఆ సంఘటనను పెద్దగా పట్టించుకోకపోవటంతోనే కొత్త సమస్యలు తెరపైకి వస్తున్నాయనే విమర్శలున్నాయి.

గత ఏడాది ములుగు, భూపాలపల్లి జిల్లాలో క్లౌడ్ బరస్ట్ తరహాలోనే మానుకోట జిల్లాలో ఈసారి వాన సునామీని సృష్టించింది. దీంతో క్లౌడ్ బరస్ట్‌లకు, టోర్నడోలకు ఓరుగల్లునే ఎందుకు కేంద్రంగా మారుతోందనే అనుమానాలు వ్యక్తం అవు తున్నాయి. దీనిపై నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం, వాతావరణ శాఖ అధికారులు త్వరితగతిన పరిశోధనలు చేయాలని, ఈ విపత్తుల ముప్పు నుంచి కాపాడేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై దృష్టి పెట్టాలని ఓరుగల్లు వాసులు కోరుతున్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ముదిరాజ్ సంఘం జాతీయ కార్యదర్శి వీరేష్



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి వీరేష్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 8 : ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ అన్నారు. ఆదివారం హనుమకొండ కేయూ రోడులోని శారద గార్డెన్స్‌లో ముదిరాజుల ఉమ్మడి జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. దీనికి వీరేష్ హాజరై మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ-ఎలోకి చేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు. కాసీని జ్ఞానేశ్వర్ మార్గదర్శకంలో జాతి హక్కుల కోసం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్‌ప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు వన్నాల కృపాసాగర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు సుభాష్, ములుగు జిల్లా అధ్యక్షుడు ఏర్ల వెంకన్న, జనగామ జిల్లా అధ్యక్షుడు కీర్తి లక్ష్మీనర్సయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు బుల్లెట్ వెంకన్న, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్, పుట్టి రాజు, కరాటే రమేష్ పాల్గొన్నారు.

నర్సంపేట మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 8: నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన 65 పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో ప్రొఫెసర్లు 8 పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్లు 6 పోస్టులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 30, సీనియర్ రెసిడెంట్లు 18, ట్యూటర్లు మూడు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. కళాశాల వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారంను డౌన్‌లోడ్ చేసుకొని పూరించిన దరఖాస్తులను అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, సెట్ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలతో కళాశాలలో వ్యక్తిగతంగా ఈనెల 11 నుంచి 13 వరకు సంప్రదించాలని పేర్కొన్నారు. ఎంపికైన ప్రొఫెసర్లకు నెలకు రూ.1.90లక్షలు అసోసియేట్ ప్రొఫెసర్లకు రూ.1.50లక్షలు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ.1.25లక్షలు సీనియర్ రెసిడెంట్‌లకు రూ.92,527, ట్యూటర్‌లకు రూ.55వేలు ఉంటుందని పేర్కొన్నారు.

నాయినిది అడ్డిమారి గుడ్డిదెబ్బ గెలుపు

- కాళోజీ కళాక్షేత్రంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడు..
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయభాస్కర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయభాస్కర్

రాంనగర్, సెప్టెంబరు 8: వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి నాయిని రాజేందర్‌రెడ్డి అడ్డిమారి గుడ్డిదెబ్బలో ఎమ్మెల్యేగా గెలిచి అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నాడని, ఆయనకు నియోజకవర్గ సరిహద్దులు కూడా సరిగా తెలియవని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ఎద్దేవా చేశారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

8నెలల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన ఉద్యోగ నియామక పత్రాలు, చేస్తున్న ప్రారంభోత్సవాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినవేనని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పైసా నిధులు తీసుకురాని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి.. కాళోజీ కళాక్షేత్రంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళోజీ కళాక్షేత్రానికి స్థలం, నిధులు ఇచ్చి 90 శాతం పనులు పూర్తి చేసిందన్నారు. కరోనా, ఎన్నికల కోడ్ వల్ల పనులు పూర్తి చేయడంలో కొంత ఆలస్యం జరిగిందన్నారు. కాళోజీ మిత్ర మండలి సభ్యులు, తాను కళాక్షేత్రం కోసం ఎంతో శ్రమించామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ పదవి చేపట్టిన కొద్దిరోజుల్లోనే కళాక్షేత్రం నిర్మాణానికి స్థలం, నిధులు ఇచ్చారన్నారు. కళాక్షేత్రం వద్ద కేవలం రంగులు వేసి, చెట్లు పెట్టి అంతా కాంగ్రెస్ చేసిందని నాయిని రాజేందర్‌రెడ్డి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తమ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలు పగులగొట్టి కొత్త శిలాఫలకాలు ఏర్పాటు చేసుకుని నాయిని ఫొటోలకు ఫోజులిస్తున్నారని వినయభాస్కర్ ధ్వజమెత్తారు. తమపై, తమ పార్టీపై ఎమ్మెల్యే నాయిని ఆరోపణలు చేస్తూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడని ధ్వజమెత్తారు. తమ సహనాన్ని పరీక్షించవద్దని వినయభాస్కర్ హెచ్చరించారు. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డిని తొర్రి, మొర్రి అని వ్యగ్యంగా వ్యాఖ్యలు ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు.

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ మాట్లాడుతూ.. కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటుకు 300 గజాల స్థలం కావాలని గత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరితే ఇవ్వలేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన వెంటనే కళాక్షేత్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని ఆయన అన్నారు. పనులు పూర్తి కావడంలో కొంత ఆలస్యమైంది వాస్తవమేనన్నారు. అంత మాత్రాన కాంగ్రెస్ చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కాళోజీ కళాక్షేత్రం, పెద్దిమోరి పనులు పూర్తి చేసి ప్రారంభించాలని ఆయన సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నేతలు మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, పులి రజనీకాంత్, నయీమ్, నార్లగిరి రమేశ్, రవీందర్‌రావు, శరత్, రాజ్‌గోపాల్‌తదితరులు పాల్గొన్నారు.

వినయభాస్కర్.. దమ్ముంటే చర్చకు రా..

- పశ్చిమ అభివృద్ధిపై ప్రజా సమక్షంలో తేల్చుకుందాం..
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సవాల్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 8: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజా సమక్షంలో చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్‌కు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో నాయిని వినయభాస్కర్‌పై మండిపడ్డారు. వినయభాస్కర్ ఓ మహానటుడని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పేరుతో ప్రజలకు మాయ మాటలు చెప్పి వంచించారని అన్నారు. మాజీ ఎమ్మెల్యేకు 'నట విరాట్' అవార్డు ఇవ్వాలని వ్యంగ్యంగా మాట్లాడారు. వినయ్‌భాస్కర్ ఎమ్మెల్యేగా 15ఏళ్ల కాలంలో, తాను ఎమ్మెల్యేగా 8నెలల కాలంలో పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, పనితనంపై చర్చకు కూర్చుందామని ప్రకటించారు. ఇందుకు సమయం, వేదిక నిర్ణయాన్ని వినయభాస్కర్‌కే ఇస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధిపై తాను చర్చ విసిరానని, అయితే తన స్థాయిని ఎత్తిచూపి వినయభాస్కర్ తప్పించుకున్నారని చెప్పారు. ఇప్పుడు ఎమ్మెల్యే స్థాయిలో సవాల్ విసురుతున్నానని, వినయభాస్కర్‌కు దమ్ముంటే రావాలని పునరుద్ఘాటించారు.

కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ బాధ్యతను వినయభాస్కర్ పూర్తిగా విస్మరించారని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. అధికారంలో ఉండి పదేళ్లుగా నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయాడని విమర్శించారు. నిర్మాణ సామగ్రి దొంగలపాలైన దుస్థితి తలెత్తిందన్నారు. కేవలం కమీషన్లు దండుకొని కళాక్షేత్రం నిర్మాణాన్ని గాలికి వదిలేశాడని వినయభాస్కర్‌పై ఆరోపణలు సంధించారు. కళాక్షేత్రం నిర్మాణ లోపాలపై నిట్ నిపుణులు హెచ్చరించినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తాను కళాక్షేత్రం నిర్మాణంపై దృష్టిపెట్టానని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరిన వెంటనే కళాక్షేత్రం పూర్తికి రూ.45కోట్లు విడుదల చేశాడని చెప్పారు. పదేళ్లుగా వినయభాస్కర్ చేయలేని పనిని, 8 నెలల్లో కళాక్షేత్రం పూర్తికి బాధ్యతగా పని చేశామని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. నయీంనగర్ బ్రిడ్జిని నాలుగు నెలల్లో పూర్తి చేశామని రాజేందర్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నగరం ముంపునకు గురైనా వినయభాస్కర్ పట్టించుకోలేదన్నారు. అప్పటి మంత్రి కేటీఆర్ స్వయంగా వచ్చి నయీంనగర్ నాలాను చూసినా ఒరగబెట్టిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తాము నయీంనగర్ నాలాను విస్తరించడంతో పాటు రిటైనింగ్ వాలా నిర్మాణం, నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టామన్నారు. ఈ కారణంగా భారీవర్షాలు వచ్చినా ఈసారి నగరం ముంపునకు గురికాలేదన్నారు. ఇది తమ చిత్తశుద్ధికి నిదర్శనమని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో భద్రకాళి మాడవీధులను ప్రతిపాదనలకే పరిమితం చేశారని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పనులు ఆచరణలోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కాజీపేట నూతన బ్రిడ్జిని ఎందుకు పూర్తి చేయలేదో వినయభాస్కర్ జవాబివ్వాలని డిమాండ్ చేశారు. ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా ఆయన పంపిణీ చేయలేదని దుయ్యబట్టారు. నగరాభివృద్ధిని వినయభాస్కర్ పూర్తిగా విస్మరించారని, 15ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా తన స్వార్థానికే పని చేశారని ఎమ్మెల్యే నాయిని ఆరోపించారు. కమీషన్లు దండుకోవడమే తప్ప.. మరో ఆలోచనే లేకుండా వ్యవహరించారని, అవినీతి, అక్రమాలు, కబ్జాలతోనే పాలన సాగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని అక్రమంగా నిర్మించారన్నారు. వినయ్‌భాస్కర్, ఆయన సోదురుడి అక్రమాలు ఒక్కొక్కటిగా బయట పెడతామని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు.

త్వరలో సీఎం పర్యటన

సెంట్రల్ ఫైనాన్స్ కమిటీ రాష్ట్ర పర్యటన క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన వాయిదా పడినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే పర్యటన వివరాలు వెల్లడిస్తామని, ఆ సమయంలో కాళోజీ కళాక్షేత్రం ఇతర అభివృద్ధి పనుల ప్రారంభం ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కాంగ్రెస్ నాయకులు బత్తిని శ్రీనివాస్, అజీజ్‌ఖాన్, బంక సరళాదేవి, బంక సంపత్ యాదవ్, డాక్టర్ పాలూరి శ్రవణ్, రవీందర్, మార్క విజయ్, బిన్నీ లక్ష్మణ్, నాగరాజు, కార్పొరేటర్లు శ్రీమాన్, విజయశ్రీ రజాలీ తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే భారత్‌ను విశ్వ గురువును చేయాలి



టీపీయూఎస్ గురుపూజోత్సవంలో సత్కారం పొందిన ఉపాధ్యాయులు


వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8: విద్య ద్వారానే భారత్‌ను విశ్వ గురువును చేయాలని, జాతీయ విద్యా విధానం ద్వారా జాతిని పునర్నిర్మాణం చేయాల్సిన బాధ్యత గురువులపై ఉందని ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్‌సీటీఈ, ఐసీఎస్ఎస్ఆర్ సభ్యుడు డాక్టర్ పారుపెల్లి శంకర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సామాజగన్మోహన్ స్మారక భవన్‌లో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శంకర్ ఆహుతులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. మన విద్యా విధానంలో పాశ్చాత్య దేశాల విధానాలను విడనాడాలన్నారు. భారతీయ జీవనవిధానం, సమైక్యత, సాంస్కృతిక విలువలు, జాతీయభావం తదితర భారతీయ విలువలను పెంపొందించేలా జాతీయ విద్యావిధానం ద్వారా విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులను కోరారు. బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పులి సరోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు బాధ్యతలను గుర్తెరిగి పనిచేసేంది టీపీయూఎస్ ఉపాధ్యాయులేనని కితాబిచ్చారు. త్వరలో రాబోయే వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచే అభ్యర్థిని గెలిపించాలన్నారు. కాగా, ఆహుతుల చేతుల మీదుగా 60 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి శాలువా, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో ఉప్పుల సహస్ర తేజ ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ఏఎంవోలు సుజన్‌తేజ, శ్రీనివాస్, వరంగల్ డీఎస్‌వో డాక్టర్ శ్రీనివాస్, టీపీయూఎస్ రెండు జిల్లాల నాయకులు బత్తిని వీరస్వామి, బత్తిని వెంకటరమణ గౌడ్, ఉప్పుల సతీష్, డాక్టర్ మునికుంట్ల, సంగెం శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు చిదురాల సుధాకర్, పిన్నింటి బాలాజీ రావు, ఎస్, పద్మాకర్‌రెడ్డి, నాంపల్లి శేఖర్‌తో పాటు రెండు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్సీవోపై అసత్య ప్రచారం తగదు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8: మహాత్మా జ్యోతిబా పూలే వరంగల్ ఆర్సీవో వై.మనోహర్‌రెడ్డిపై విద్యార్థి సంఘాల అసత్య ప్రచారం మానుకోవాలని యూటీఎఫ్ ఎంజేపీ వింగ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లివింగ్‌స్టన్ హితవు పలికారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మనోహర్‌రెడ్డిపై విద్యార్థి సంఘాలు చేస్తున్న అసత్యపు ఆరోపణలను యూటీఎఫ్ ఎంజేపీ విభాగం తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. మనోహర్‌రెడ్డి అనారోగ్య కారణాలతో తనను వైదొలగించాలని ఎంజేపీ సెక్రెటరీకి విన్నవించుకోవడం వల్లనే ఆయనకు ఉన్న అదనపు బాధ్యతలు తొలగిస్తున్నట్లు సెక్రెటరీ తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇప్పటికైనా మనోహర్‌రెడ్డిపై విద్యార్థి సంఘాల నాయకులు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు.

యువతి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు



ఆత్మహత్యాయత్నం చేసిన యువతిని కాపాడిన పోలీసులు

మడికొండ, సెప్టెంబరు 8: ఓ యువతి కుటుంబ సభ్యులతో గొడవ పడి మనస్తాపంతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట సోమిడికి చెందిన భీమ్‌శెట్టి రమకు తన ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రమ మడికొండలోని అయోధ్యపురం రైల్వే గేటు వద్దకు చేరుకుని ఆత్మహత్య చేసుకోవడానికి పట్టాలపై ఉండగా గేట్‌మెన్ గమనించి 100కు డయల్ చేశాడు. వెంటనే స్పందించిన బ్లూకోల్ట్స్ పోలీసులు అక్కడకి చేరుకొని రమను పక్కకు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాలు తెలుసుకొని ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ సూచన మేరకు ఆమెను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాధితురాలి తల్లిదండ్రులతో పాటు, పలువురు పోలీసులను అభినందించారు.

జడ్పీ డ్రైవర్ యుగేంధర్‌పై సస్పెన్షన్ వేటు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 8 : హనుమకొండ జిల్లా పరిషత్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న యుగేంధర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కలెక్టర్, జడ్పీ స్పెషల్ ఆఫీసర్ ప్రావీణ్య ఈ మేరకు రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని జడ్పీ సీఈవో విద్యాలత ధృవీకరించారు. యుగేంధర్ గతంలో ఓ మంత్రి వద్ద పనిచేస్తున్న సమయంలో ఉద్యోగాల కల్పన పేరుతో డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం అనేక మలుపులు తిరగడం.. చివరకు పోలీసు కేసు వరకు వెళ్లి యుగేంధర్ కరీంనగర్‌లో జైలు పాలైనట్లు సమాచారం. దీనిపై కూపీలాగిన అధికారులు.. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో నిజానిజాలు పరిశీలించిన తర్వాత రెండురోజుల క్రితం సస్పెన్షన్ వేటువేసినట్లు సమాచారం.

నిబంధనలకు 'మసి'

- వరంగల్ రూరల్ కార్యాలయంలో విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు
- ఆలస్యంగా వెలుగులోకి సబ్ రిజిస్ట్రార్ దందా

రాంనగర్, సెప్టెంబరు 8 : ప్రభుత్వ నిబంధనలకు మసి పట్టించిన ఒక సబ్ రిజిస్ట్రార్.. విచ్చలవిడిగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. గత నెలలో బదిలీపై వెళ్లిన సదరు సబ్ రిజిస్ట్రార్.. పోతూ పోతూ పెద్దఎత్తున మూటగట్టుకుపోయినట్లు సమాచారం. ఆ సబ్ రిజిస్ట్రార్ దశాబ్ద కాలంగా వరంగల్ రూరల్, ఖిలావరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే విధులు నిర్వహించారు. ఈ సమయంలో ఈయనపై పలు ఆరోపణలు వచ్చినా.. ఆర్థిక, యూనియన్ బలంతో ఎవరు ముట్టుకోలేదని సమాచారం ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన ఒక రాష్ట్ర యూనియన్ నేత ఈయనను కాపాడుతుంటాడనే ప్రచారం ఉంది. ఆ నేత ఆశీస్సులతో ఈ రెండు కార్యాలయాల్లో విధులు నిర్వహించిన సదరు సబ్ రిజిస్ట్రార్.. నిబంధనలు బుట్టదాఖలు చేసి రిజిస్ట్రేషన్లు చేసి భారీగానే మూట గట్టుకుని బదిలీపై వెళ్లినట్లు తెలిసింది. తాజాగా సదరు సబ్‌రిజిస్ట్రార్ బాగోతంఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఖిలా వరంగల్‌లో ఉన్నప్పుడు అందినకాడికి దండుకున్న సదరు సబ్ రిజిస్ట్రార్.. వరంగల్ రూరల్ కార్యాలయంలోనూ ఆదే రీతిన వ్యవహరించి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు సమాచారం. వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిధిలోని ఊకల్ ప్రాంతంలో నిబంధనలు పక్కనపెట్టి ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఈ సంఖ్య 40కి పైగానే ఉన్నట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లు మే నెల నుంచి ఆగస్టు వరకు చేసినవి కావడం విశేషం. ఆగస్టు నెల మొదటి వారంలో బదిలీపై వెళ్లిన ఆయన.. ఆ నాలుగురోజుల్లో పదికిపైగానే రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌లకు గజాల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం.

గత నెల 23న ఈ సబ్ రిజిస్ట్రార్ గొర్రెకుంట ప్రాంతంలో 30కి పైగా నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసి గజాల చొప్పున దండుకున్నాడు. ఈ మేరకు నిబంధనలకు విస్మరించి అడ్డగోలు రిజిస్ట్రేషన్‌లు అనే కథనం ప్రచురించిన విషయం తెలిసింది. ప్రభుత్వ నిబంధనలను, ఉన్నతాధికారులను మసి పూసి మారేడుకాయ చేసే సత్తా కలిగిన సదరు సబ్ రిజిస్ట్రార్ దందాపై విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



అమ్మవారిని దర్శించుకుంటున్న ధర్మారెడ్డి దంపతులు

భద్రకాళి అమ్మవారి సన్నిధిలో
మాజీ ఎమ్మెల్యే చల్లా

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 8: పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దంపతులు ఆదివారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా చల్లా ధర్మారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు అర్చకులు ఆశీర్వచనం అందజేశారు.

11న భద్రకాళి అమ్మవారి
ఒడిబియ్యం వేలం

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 8: చారిత్రక భద్రకాళిఅమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడిబియ్యం సుమారు 30 క్వింటాళ్ల ఒడిబియ్యాన్ని ఈనెల 11 బుధవారం ఉదయం 11గంటలకు బహిరంగ వేలం ద్వారా విక్రయించబడునని ఆలయ ఈవో శేషు భారతి తెలిపారు. ఈ బహిరంగ వేలం పాటలో పాల్గొనే వారు ధరావత్ రూ. 5వేలు డీడీ రూపంలో చెల్లించి పాల్గొనాలని ఇతర వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

విద్యుత్తు షాక్‌తో రెండు గేదెల మృతి

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 8: విద్యుత్తు షాక్‌కు గురై రెండు పాడి గేదెలు మృతి చెందాయి. బాధితుడు కన్నబోయిన రాజయ్య కథనం ప్రకారం. మూడో డివిజన్ కొత్తపేట శివారులో ఆదివారం మేతకు వెళ్లిన గేదెలకు గడ్డిలో కిందకు వేలాడుతున్న కరెంటు వైర్లు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. పాడి గేదెలను హర్యానా నుంచి తీసువచ్చామని, సుమారు రూ.2.60 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంభునిపేట, సెప్టెంబరు 8: వెనుక నుంచి వాహనం ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన బొల్లికుంట క్రాస్ రోడ్ వద్ద జరిగింది. మామునూరు సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. పున్నేలుకు చెందిన ఎస్‌కే సర్వర్(55) పున్నేలు క్రాస్ రోడ్‌లో చికెన్ సెంటర్‌లో పనిచేస్తుంటాడు. ఆదివారం చికెన్‌సెంటర్ నుంచి రామకృష్ణాపురంలోని తన కూతురు ఇంటికి చేరుకునే క్రమంలో బొల్లికుంట క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారిపై ఖమ్మం నుంచి వరంగల్ వైపు వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన సర్వర్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచార అందుకున్న సీఐ ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి, మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఢీకొట్టిన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు.




రంగశాయిపేట కాకతీయ యూత్ ఆధ్వర్యంలో



ధర్మారంలో హోల్‌సెల్ మార్కెట్‌లో వర్తక సంఘం ఏర్పాటు చేసిన గణపతి




రామన్నపేట గాంధీ విగ్రహం సెంటర్‌లో..



బట్టలబజార్‌లోని బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో ..



రామన్నపేట బొడ్రాయి వద్ద పోక, పీటీ వక్కల వినాయకుడు



కుంటిభద్రయ్య ఆలయానికి వెళ్లే దారిలో బాదంపప్పు బటానీల వినాయకుడు

అందుకో మా పూజ..

నగరంలో ఘనంగా సాగుతున్న నవరాత్రి వేడుకలు

శంభునిపేట, సెప్టెంబరు 8 : వినాయక చవితి పర్వదినం సందర్భంగా నగరంలోని వాడవాడలా గణనాథులను ప్రతిష్ఠించారు. రంగశాయపేటలో కాకతీయ యూత్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుడు వద్ద బాలగంగాధర తిలక్ సూక్తులు, చిత్రపటం ఆకట్టు కుంది. మహంకాళీ ఆలయం, శంభునిపేట, విశ్వనాథకాలనీ, గణేష్‌నగర్, వినాయక నగర్, రాంగోపాలపురం, సత్యసాయినగర్‌లతోపాటు విలీన గ్రామాలైన నక్కలపల్లి, తిమ్మాపూర్, ఫించన్‌పూర్, మామునూరు, బెటాలియన్, బొల్లికుంట, గాడెపల్లి, వసంతాపూర్, స్తంభంపల్లి, దూపకుంట గ్రామాల్లో ఉత్సవాలు అంబరాన్నంటాయి. రంగశాయిపేటలోని భవానీ శంకరాలయంలో మహాఅన్నదాన నిర్వహించారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్‌లు గుండు చందన పూర్ణచందర్, పోశాల పద్మస్వామి, గద్దె బాబు, ఈదురు అరుణ విక్టర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్, కర్నె రవీందర్, ముత్తినేని రామ్మూర్తి, కొల్లూరి యోగా నంద్, కొట్టె వినయ్ తదితరులు పాల్గొన్నారు.

» కాశిబుగ్గ: గణపతి నవరాత్రులను అత్యంత భక్తిశ్రద్ధలతో నగర వాసులు నిర్వహిస్తున్నారు. అన్ని వీధుల్లో గణనాథుడు పూజలందుకుంటున్నాడు. చూడముచ్చటగా వేదికలను నిర్వాహకులు అలంకరించారు. విద్యుత్ వెలుగులతో కాలనీలు మెరుస్తున్నాయి.



రంగశాయిపేట భవానీ శంకరాలయంలో అన్నదానం

» ఖిలావరంగల్: క్రిస్టియన్‌కాలనీ, శివనగర్, ఖిలావరంగల్ పడమర, మధ్యకోట, తూర్పుకోటలో గణపతి నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. పడమర కోట చెమన్ వద్ద అనుమాన సత్యం స్థానిక ప్రజలకు వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాపయ్య, జగ్గయ్య, రమ, వాణి, రాజేష్, బాలరాజు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



కాశిబుగ్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడు

పోక వక్కలు, బాదాం పప్పు, బటానీల వినాయకులు

వరంగల్ కల్చరల్: రామన్నపేటలోని బొడ్రాయి సమీపంలో పోకవక్కలు, పీటీ వక్కలతో ఏర్పాటు చేసిన వినాయకుడు ఆకట్టుకున్నాడు. అలాగే పాపయ్యపేట, రామన్నపేట సమీపంలోని కుంటి భద్రయ్య ఆలయానికి వెళ్లే దారిలో ఉత్సవ సమితి నిర్వాహకులు తెల్ల, గోధుమ రంగు బటానీలు, బాదం పప్పుతో తయారు చేసిన వినాయకుడిని ఏర్పాటు చేశారు.



పిన్నవారి వీధిలో ఫ్రెండ్ యూనిట్ వారి గణపతి



వరంగల్ చౌరస్తాలో బంగారు వర్తక సంఘం గణపతి



జేపీఎన్ రోడ్డు ఫ్రెండ్స్ యూనిట్ వారి గణపతి



రామన్నపేటలో శ్రీసీతారామ ఉత్సవ సమితి గణపతి



వరంగల్ రైల్వేగేట్ వద్ద భారీ గణపతి

జిల్లా నాటక సమాజాల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



నాటక సమాజాల కార్యవర్గం

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 8: తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య వరంగల్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు ఆదివారం పోతన విజ్ఞాన పీఠంలోనిర్వహించారు. ఈ ఎన్నికలు రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, ఉపాధ్యక్షులు కాజీపేట తిరుమలయ్య, కార్యవర్గ సభ్యులు గూడూరు బాలాజీ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా మాడిశెట్టి రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఆకుతోట లక్ష్మణ్, కోశాధికారిగా వనపర్తి రాజేంద్రప్రసాద్, కార్యవర్గం, ఇతర బాధ్యులుగా చిన్నబోయిన రాందాస్, కుసుమ సుధాకర్, చొక్కం శ్రీనివాస్, జూలూరి నాగరాజు, గట్ల భిక్షపతి, మాలి విజయరాజ్, ఏనుగు నారాయణ, కర్రె శంకర్, గోదాసి అశోక్‌కుమార్, రాజేశ్వర్‌రావుతో గౌరవ సలహాదారులు ఐదుగురిని ఎన్నుకున్నారు.

ఆర్థికాభివృద్ధికి పరపతి సంఘాల దోహదం

కాశిబుగ్గ, సెప్టెంబరు 8: ఆర్థికాభివృద్ధికి పరపతి సంఘాలు దోహదపడుతాయని పద్మశాలి పరపతి సంఘం గౌరవ అధ్యక్షుడు గుండేటి నరేందర్ తెలిపారు. కాశిబుగ్గ పద్మనగర్ పద్మశాలి పరపతి సంఘం 23వ వార్షికోత్సవం ఆదివారం తిలక్‌రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. సమావేశంలో గడిచిన సంవత్సరం లెక్కలను ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడి ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుసుమ సారంగపాణి, కార్యదర్శిగా దూడం అనిల్ కుమార్, కోశాధికారిగా గడ్డం రమేష్ భరద్వాజ్, సహ కోశాధికారిగా వడ్డెపల్లి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కుసుమ సాగర్, కూరపాటి మోహన్, మాటేటి అశోక్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గంజి సాంబయ్య, బైరి రఘుపతి, ములుక సురేష్, పిట్టల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుండేటి నరేందర్

'చెరువులు, కుంటలను పరిరక్షించాలి'



యశ్వంత్‌కుమార్‌కు రిపోర్టును అందజేస్తున్న సుదర్శన్

ఖిలావరంగల్, సెప్టెంబరు 8: పేదల పేరిట రాజకీయ నాయకులు, కబ్జా చేసిన చెరువులు, కుంటలను ప్రభుత్వం రక్షించాలని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి చర్ల సుదర్శన్ కోరారు. ఆదివారం శివనగర్‌లోని సంస్థ కార్యాలయం లో చెరువులు, కుంటలపై ఉమ్మడి వరంగల్ జిల్లా సమాఖ్య న్యాయ ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉవ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు పరిరక్షణకు ఏకో- లీగల్ సెల్‌ను చైర్మన్ మురారిశెట్టి యశ్వంత్‌కుమార్‌ను ఎన్నుకున్నామన్నారు. సభ్యులుగా న్యాయవాదులు ఆర్.ఆనంద్‌రావు, ఆర్.భిక్షపతి, బి.అనిల్‌కుమార్‌లు వ్యవహరిస్తారన్నారు. నగరంలోని 72చెరువులు, కుంటలు, చారిత్రక కుంటలు, కార్యక్రమం లో వినియోగదారుల సంస్థ సభ్యులు కార్తీక్, జే. వీరస్వామి, ప్రభాకర్, రమేష్, వీరభద్రయ్య పాల్గొన్నారు.

సమాచారం హక్కు చట్టాన్ని కాపాడుకోవాలి

శంభునిపేట, సెప్టెంబరు 8 : సామాన్య ప్రజలకు వజ్రాయుధం లాంటి సమాచార హక్కు చట్టం-2005ను కాపాడుకోవాలని సమాచార హక్కు వికాస సమితి వరంగల్ జిల్లా అధ్యక్షులు సాదుల పూర్ణచందర్ అన్నారు. సమాచార హక్కు వికాస సమితి 9వ వార్షికోత్సవం శనివారం శంభునిపేట జంక్షన్‌లో ఘనంగా నిర్వహించుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులు పూజారి హరి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పూర్ణచందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాచార చట్టంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వికాస సమితి జెండాను ఎగురవేసి పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు దేవులపల్లి కమలాకర్, గోవిందుల వేణు, ఎమ్డీ యాకూబ్ పాషా, శ్రీరామ మల్లేశం, శివ, వలుపదాసు కృష్ణ, అయిత నగేష్, ఎమ్డీ సలీం, మైదం సంజీవ, కంప రాములు, పూజారి హనిరుద్, రాజ్‌కుమార్, నరేష్, వలుపదాసు మల్లయ్య, రాము పాల్గొన్నారు.



శంభునిపేట జంక్షన్‌లో జెండా ఆవిష్కరించిన నాయకులు

బీసీ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్



క్రిష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న ప్రభాకర్

వరంగల్‌సిటీ, సెప్టెంబరు 8: తెలంగాణ బీసీ ప్రజా సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నగరంలోని 19వ డివిజన్ ఓసిటీకి చెందిన దయ్యాల ప్రభాకర్ నియమితులయ్యారు. ఆదివారం బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ నియమించారు. నియామకపు ప్రతాన్ని హైదరాబాద్ బీసీ ప్రజా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్యా చేతుల మీదుగా ప్రభాకర్ అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభాకర్ మాట్లాడుతూ.. జిల్లాలో బీసీ ప్రజా సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

శంభునిపేట క్రికెట్ లీగ్ పోటీలు



క్రికెట్ పోటీల్లో విజేతలకు ట్రోఫీని అందిస్తున్న నిర్వాహకులు

శంభునిపేట, సెప్టెంబరు 8: శంభునిపేట క్రికెట్ లీగ్ (ఎస్‌సీఎల్) ఆధ్వర్యంలో గ్రేటర్ సిటీ స్థాయి క్రికెట్ పోటీలను రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. శనివారం ప్రారంభమైన పోటీలు ఆదివారం ముగి శాయి. ఈ పోటీల్లో హన్మకొండ, వరంగల్ ప్రాంతాలకు చెందిన 20 జట్లు పాల్గొన్నాయి. వరంగల్‌కు చెందిన సాయి-11 టీమ్ విజేతగా నిలిచింది. జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు సింగారపు బాబీ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి గెలుపొందిన జట్టుకు వారికి ట్రోఫీని అందించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. ఈ టోర్నీకి ఎమ్డీ మోబీన్ ఆర్గనైజర్‌గా వ్యవహరించగా పలువురు క్రీడాకారులు, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

పురాతన శిల్పాలను పరిరక్షించాలి

పురావస్తు శాఖకు అద్దాల గ్యాలరీ బహూకరణ

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 8: కాకతీయులు మనకు ఇచ్చిన వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని భారత జాగృతి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి మడిపెల్లి సుశీల్ గౌడ్ అన్నారు. గణపతి నవరాత్రి సందర్భంగా వరంగల్ పురావస్తు ప్రదర్శనశాలలో ఉన్న పురాతన వినాయక విగ్రహానికి అద్దాల గ్యాలరీని పురావస్తు శాఖ అధికారులకు ఆదివారం సుశీల్ గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లూ నాయక్, టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య, రాకేష్ పాల్గొన్నారు.



అద్దాల గ్యాలరీని అందజేస్తున్న సుశీల్ గౌడ్



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL సోమవారం 9 సెప్టెంబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

15వ రోజుకు చేరిన గాడ్గె నిరాహార దీక్ష



దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రసాద్

గీసుగొండ, సెప్టెంబరు 8 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ గీసుగొండలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గాడ్గె చేస్తున్న నిరాహార దీక్ష 15వ రోజుకు చేరింది. ఆదివారం పలు సంఘాల నాయకులు గడ్డం శరత్, జన్ను అనిల్, పిట్టల రాజమొగిలి, మాదాసి సురేష్, కేడల ప్రసాద్, ధర్మపురి రామారావు, బస్కె నాగరాజు, తీన్మార్ మల్లన్న టీం సభ్యులు దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. 15రోజులుగా దీక్ష చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమన్నారు. గాడ్గె ఆరోగ్యపరిస్థితి విషమిస్తుందని అతడికి ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు.

టీపీసీసీ చీఫ్‌కు ఎమ్మెల్యే నాగరాజు శుభాకాంక్షలు



టీపీసీసీ చీఫ్‌తో ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, సెప్టెంబరు 8 : టీపీసీసీ అధ్యక్షుడుగా నియమితులైన మహేష్ గౌడ్‌ను ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. టీపీసీసీ చీఫ్‌ను సన్మానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు నిమ్మాని శేఖర్‌రావు పాల్గొన్నారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా నిమితులైన బొమ్మ మహేష్‌గౌడ్‌ను కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్ రావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి, పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు.

మృతిచెందిన జర్నలిస్టు కుటుంబానికి చెక్కు అందజేత



మృతుడి భార్య లతకు చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఖానాపురం, సెప్టెంబరు 8 : మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు మానెపల్లి శివ ఇటీవల మృతి చెందాడు, కాగా, ఆదివారం హైదరాబాదులో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న ప్రజాపాలనలో కార్యక్రమంలో రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా మృతుని భార్య లతకు రూ.ఒక లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఐజేయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోదాటి గోపాల కృష్ణ, ఐజేయూ నాయకులు శీలం రమేష్, తోట సుధాకర్ పాల్గొన్నారు.

వాడవాడన కొలువుదీరిన గణనాథులు



నర్సంపేటలో గణపతికి పూజలు చేస్తున్న కౌన్సిలర్ పద్మ దంపతులు, భక్తులు, వర్ధన్నపేటలో, ఖానాపురంలో చెన్నారావుపేటలో, నెక్కొండలో పూజుల చేస్తున్న భక్తులు

నర్సంపేట, సెప్టెంబరు 8 : గణేశ్ నవరాత్రోత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో శనివారం ప్రారంభమయ్యాయి. నర్సంపేట మండలంలో ఏర్పాటు చేసిన మండపాల్లో గణనాథులు కొలువుదీరారు. ఆయామండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్టించి ఉత్సవ కమిటీ సభ్యులు, యువజన తదితర సంఘాల నాయకులు, భక్తులచే అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గణపతికి నైవేద్యాలు సమర్పించి తమ కోర్కెలు తీర్చాలని భక్తులు వేడుకున్నారు. పట్టణంలోని శివాంజనేయ స్వామి ఆలయం, కూరగాయల మార్కెట్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వల్లబ్‌నగర్, శాంతినగర్, ప్రభుత్వ బాలికోన్నతపాఠశాల, ఎస్‌బీఐ సమీపంలో వ్యాపారస్తుల ఆధ్వర్యంలో, ఆర్య వైశ్య సంఘంలో ఆ సంఘం ఆధ్వర్యంలో, రెడ్డి సంఘంలో ఆ సంఘం ఆధ్వర్యంలో చరఫ్ కాస్ హైస్కూల్ సమీపంలో ఇలా పట్టణంలోని అనేక ప్రాంతాలలో గణపతులను ప్రతిష్టించి అర్చకులచే పూజలు నిర్వహించి వినాయకనవరాత్రోత్సవాలను ఘనంగా ప్రారంభించి ప్రత్యేక పూజలుచేశారు. పట్టణంలోని 1వ వార్డులో న్యూస్నేహ యూత్‌సభ్యుల ఆధ్వర్యంలో మట్టి గణపతిని ప్రతిష్టించారు.పూజాకార్య క్రమంలో బొల్ల స్వామి, మిడిదొడ్డి బాబూరావు, భక్తులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట: పట్టణంలో కుల, యువజన, వ్యాపార వాణిజ్య సముదాయల ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో విగ్రహాలను ప్రతిష్టించారు. ఆయా మండపాల వద్ద అర్చకులు, పూజలు వేదమంత్రోశ్చరణలతో గణపతికి పూజలు నిర్వహించారు.పట్టణంలోని ఆల్ఫోర్స్ ఈ టెక్నోపాఠశాలలో వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య ఘనంగా కలశస్థాపన, నవగ్రహ ఆరాధానచేసి సాంప్రదాయబద్ధంగా మట్టి గణపతులను ప్రతిష్టించారు.

● వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో వివిధ కుల సంఘాలు, యువకులు, యూత్ అసోసియేషన్‌లు, పలు కాలనీవాసులు ఏర్పాటు చేసిన మండపాల్లో గణనాథుడు కొలువుదీరాడు. వేదపండితుల ప్రత్యేక పూజల నడుమ బొజ్జ గణపయ్యను ప్రతిష్ట చేసి ఉత్సవాలు ప్రారంభించారు. మండలంలోని కొత్త పెల్లిలో కమ్మగోని సుధాకర్,స్వామినాయకుడు, రవీందర్, కుమారస్వామి, రాజ్‌కుమార్‌లు వారి తల్లిదండ్రులు కమ్మగోని ఐలమ్మ ఎల్లయ్యల స్మారకార్థం ఏర్పాటు చేసిన మండపంలో గణనాథుడిని ప్రతిష్టించగా ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మండలంలోని ఇల్లందలో మత సామరస్యం వెల్లివిరిసింది. ఆజాద్ హింద్ ఫౌజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన గణపతి నవరాత్రి ఉత్సవాలకు గాను గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు మహ్మద్ యాసిన్ పంచముఖ గణపతిని అందించి విగ్రహ దాతగా నిలిచాడు. మత సామరస్యానికి ప్రతీకగా వినాయక చవితి పండుగ జరుపుకోవడం ఎంతో అభినందనీయమని గ్రామస్థులు తెలిపారు.

● ఖానాపురం : మండల వ్యాప్తంగా మండపాల వద్ద ప్రత్యేక అలంకరణలు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మండల కేంద్రంలోని ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద శని, ఆదివారాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ యూత్ సభ్యులు గుళ్లపెల్లి విజయ్, వడ్డె రాజశేఖర్, గంగపురం రాజు, వడ్డె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో వాడవాడన గణనాథులు వెలిశారు. మండల కేంద్రంలో యువ సేనాయూత్ ఆధ్వర్యంలో, చైతన్య యూత్, నంబర్ వన్ కాలనీలో, కట్టయ్యపల్లెలో. సిద్దేశ్వరాలయంలో గణనాథుల విగ్రహాలను ప్రతిష్టాపన చేశారు. సిద్దార్థ గురుకుల విద్యాలయంలో మట్టి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. లింగగిరిలో యువ యూత్ ఆధ్వర్యంలో 21కిలోల లడ్డును కొడారి రాజుమౌనిక దంపతులు స్వామికి ప్రసాదంగా అందించారు.

● నెక్కొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమైనాయి. మండల కేంద్రంలో దాదాపు 25 గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేయగా, మండలంలోని గ్రామాల శివారు కాలనీలు, గిరిజన తండాల్లో ఐదు నుంచి పది విగ్రహాలను ఏర్పాటుచేశారు. నవరాత్రి ప్రారంభ వేడుకలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

● రాయపర్తి : మండలంలోని ఆయా గ్రామాల్లో వాడవాడలా గణనాధులు కొలువుదీరారు. వేద పండితుల నడుమ పూజలు నిర్వహించి, గ్రామాల భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పోలీసులు సైతం కమిటీ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు.



ఇల్లందలో పూజలు నిర్వహిస్తున్న యువకులు

● గీసుగొండ : వినాయక నవరాత్రుల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గణనాథులు కొలువుదీరారు. ఆదివారం వినాయక మండపాల వద్దకు భక్తులు పెద్దసంఖ్యలో చేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మారం వద్ద గల హోల్‌సేల్ కాంప్లెక్స్ వద్ద పూరి జగన్నాథ ఆలయం తరహాలో భారీ సెట్టింగ్ ఆకట్టుకుంది.

● నల్లబెల్లి : మండలంలో గణపతి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో వివిధ యూత్ సంఘాల ఆధ్వర్యంలో వినాయక వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● పర్వతగిరి: మండలంలోని ఆయా గ్రామాల్లో యువజన సంఘాలు, కులసంఘాల ఆధ్వర్యంలో గణనాథుని విగ్రహాలను ఏర్పాటుచేశారు. మండపాలను అందంగా అలంకరించి డప్పుచప్పుళ్లు, బాణాసంచాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్టించారు. ఆయా మండపాల వద్ద అన్నదానం కార్యక్రమాలను చేపట్టారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



చెక్కును అందిస్తున్న ట్రస్టు చైర్మన్ డాక్టర్ మోహన్‌రావు

నర్సంపేట, సెప్టెంబరు 8 : నిరుపేద విద్యార్థిని చదువు కోసం నర్సంపేటకు చెందిన ఇద్దరు డాక్టర్లు వేర్వేరుగా ఆర్థిక సాయాన్ని అందజేశారు. నర్సంపేటకు చెందిన గణిపాక శ్రీనివాస్ కుమార్తె గణిపాక హన్సిత పేద విద్యార్థినికి హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం సీఎస్సీ విభాగంలో సీటు రాగా, ఆ కోర్సు చదవడానికి ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో విషయం బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కల్లెపెల్లి సురేశ్ ద్వారా తెలుసుకున్న పట్టణానికి చెందిన పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ పి.గోపాల్ విద్యార్థినికి రూ:20వేలు ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లో అత్యున్నత స్థాయికి ఎదగాలని విద్యార్థిని ఆశీర్వదించారు. అలాగే ఈ విషయాన్ని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కల్లెపెల్లి ప్రణయదీప్, రాష్ట్ర కార్యదర్శి తడుగుల విజయ్‌కుమార్, పూలే అంబేడ్కర్ యువజన సంఘం నిర్వాహకుడు బాణాల శ్రీనివాస్, మరికొందరి ద్వారా తెలుసుకున్న పట్టణంలోని మాతృభూమి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ అర్శనపల్లి మోహన్‌రావు స్పందించి హన్సిత చదువు కోసం రూ:40 వేలను చెక్కు రూపేణ అందజేశారు. మాతృభూమి చారిటబుల్ ట్రస్టు ద్వారా నిరాదరణకు గురైన పిల్లల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఉన్నత చదువులు చదవడానికి ఆర్థిక స్తోమతలేని పేద విద్యార్థులకు ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బాణాల రమేశ్, గన్నారపు సదానందం, కొమ్ముల నవీన్, కొమ్ముల కరుణాకర్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ పట్టణ ప్రచార కార్యదర్శి మండల శ్రీనివాస్ హన్సికకు రూ:5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి




జగన్నాథం (ఫైల్)

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 8 : నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ కొమురం జగన్నాథం (44) మృతి చెందిన సంఘటన నర్సంపేట పట్టణంలో శనివారం చోటు చేసుకున్నది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం... ములుగు జిల్లా మంగపేట మండలం చింతకుంట గ్రామానికి చెందిన కొమురం బుచ్చయ్య-పాపక్క దంపతుల కుమారుడైన జగన్నాథం మూడేళ్లుగా నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో రమణమూర్తికి గన్‌మెన్ పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి వరకు విధులు ముగించుకొని స్థానిక పోలీస్ క్వార్టర్స్‌కు వెళ్లాడు. శనివారం ఉదయం జగన్నాథం నిద్ర నుంచి ఉదయం 9 గంటలైనా లేవకపోవడంతో భార్య ఆందోళనకు గురై కన్నీరుమున్నీరైంది. గమనించిన పక్కనున్న క్వార్టర్స్‌లోని పోలీసు సిబ్బంది 108కు సమాచారం అందించారు. 108లో జగన్నాథంను నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతునికి భార్య లీల, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని డీసీపీ రవీందర్, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ రమణమూర్తిలు సందర్శించి నివాళులర్పించారు.

జేబుదొంగను పట్టుకున్న పోలీసులు

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 8 : ప్రయాణికుడి జేబు నుంచి డబ్బులను దొంగతనం చేస్తుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన నర్సంపేట బస్టాండ్‌లో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన దక్క సాంబయ్య అనే వ్యక్తి ఆదివారం నర్సంపేట నుంచి హన్మకొండకు వెళ్లడానికి బస్టాండ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో హన్మకొండ బస్సు ఎక్కుతుండగా అతని వెనుకాల గుర్తు తెలియని దొంగ సాంబయ్య జేబు నుంచి రూ.8వేల నగదును తస్కరించాడు. గమనించిన ప్రయాణికుడు కేకలు వేయడంతో అక్కడే విధుల్లో వున్న పోలీసులు దొంగను పట్టుకొని అతడి నుంచి రూ.8వేలు తీసుకొని ప్రయాణికుడికి అందజేశాడు. అనంతరం దొంగను పోలీస్‌స్టేషన్‌కు విచారణ నిమిత్తం తీసుకెళ్లారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



ముప్పు కృష్ణ

నల్లబెల్లి, సెప్టెంబరు 8 : మండల నూతన తహసీల్దార్‌గా ముప్పు కృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన బోనగాని రాజేష్ ఉద్యోగ బదిలీ రీత్యా నర్సంపేటకు వెళ్లారు. అనంతరం హనుమకొండ సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉద్యోగ బదిలీ రీత్యా నల్లబెల్లికి తహసీల్దార్‌గా కృష్ణ వచ్చారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తోటి ఉద్యోగ సిబ్బంది తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పంటలను అధికారులు పరిశీలించాలి

చెన్నారావుపేట, సెప్టెంబరు 8 : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నష్టం జరిగిన పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు పరికి మధుకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఉప్పరపల్లి, కాల్ నాయక్‌తండా గ్రామాల్లో వర్షాలతో నష్టం జరిగిన పంటలను పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో పత్తి పంటలో పత్తి కాయలు రాలి నల్లగా మారాయన్నారు. రైతులకు తీవ్ర నష్ట వాటిల్లిదన్నారు. అధికారులు పంటలను పరిశీలించి రైతులకు నష్ట పరిహారం అందించాలన్నారు. అలాగే పదహారు చింతల్‌తండా గ్రామంలోని బానోతు హరిలాల్ ఇంటి గోడ కూలిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వెడుకోంటుంది. ఈ కార్యక్రమంలో రైతులు, వెంకన్న, గుగులోతు లక్ష్మన్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాల తొలగింపు

పర్వతగిరి, సెప్టెంబరు 8: మండలంలోని వడ్లకొండలో బంజరుదొడ్డి స్థలాన్ని ఆక్రమించి కొందరు నిర్మించిన నిర్మాణాలను తొలగించినట్లు కార్యదర్శి సునీల్ తెలిపారు. ఎన్నోఏళ్లుగా గ్రామానికి చెందిన బంజరుదొడ్డిలో కొందరు గ్రామస్థులు ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తొలగించినట్లు తెలిపారు.

పాలకుర్తి దేవస్థాన చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

రాయపర్తి, సెప్టెంబరు 8 : మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన పాలకుర్తి సోమనాథ దేవస్థాన చైర్మన్ కృష్ణమాచార్యులను ఆదివారం ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలు పరామర్శించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరి వెంట మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మండల నాయకులు ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిర్ర మల్లయ్య నర్సయ్య ఉన్నారు.

నేషనల్ హైవేపై ప్రమాదాల నివారణే లక్ష్యం

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 8 : వరంల్-ఖమ్మం జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 563)పై రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యమని వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ నుంచి రాయపర్తి మండలం కిష్టాపురం క్రాస్ వరకు నేషనల్ హైవే పై ఎక్కడెక్కడ మూలమలుపులు ఉన్నాయో గుర్తించడంతో పాటు, గుంతలు పడిన చోట వాటిని పూడ్చేయాలని నేషనల్ హైవే అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో రాయపర్తి ఎస్ఐ శ్రవణ్ కుమార్, నేషనల్ హైవే ఏఈ మదన్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

తాడ్వాయి అడవులను సందర్శించిన టీజేఎస్ బృందం

● ఎప్పుడూ చూడని విపత్తు ఇది : టీజేఎస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



చెట్లు కూలిన విషయాన్ని అటవీ అధికారిని అడిగి తెలుసుకుంటున్న టీజేఎస్ నాయకులు

నర్సంపేట, సెప్టెంబరు 8 : ఇటీవల సుడిగాలి బీభత్సంతో 15కిలో మీటర్ల విస్తీర్ణంలో పెద్ద, పెద్ద చెట్లు విరిగి పడిన ములుగు జిల్లా మేడారం, తాడ్వాయి అడవులను టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీజెఎస్ బృందం సందర్శించింది. ఆదివారం నర్సంపేటకు చెందిన టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు 500ఎకరాల్లో వేలాది చెట్లు నేల మట్టమైన ఘటన గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. ప్రకృతి విధ్వంసాన్ని అరికట్టడంతో ప్రభుత్వాలు విఫలమవుతుండడంతో ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. ప్రకృతి విధ్వంసంతోపాటు పశుపక్షాదులు హడలెత్తి పోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఇలాంటి విపత్తు గ్రామాల్లో, పట్టణాల్లో జరిగి ఉంటే ప్రాణనష్టం, ఆస్తినష్టం ఊహించలేనిదన్నారు. తాడ్వాయి అడవుల్లో విధ్వంసమైన భారీ చెట్లలో నల్లమద్ది, పెద్దేగి, ఇప్ప, తీర్మాన్, జిట్రేగి, సండ్ర, బండారు, ఉసిరి, బూరుగు తదితర చెట్లు ఉన్నాయన్నాయని వెల్లడించారు. ఇది అత్యంత ప్రమాదకర విపత్తుగా పరిగణించాలన్నారు. తాడ్వాయి అడవుల్లో జరిగిన ప్రకృతి విధ్వంసంపై శాస్త్రీయ పద్ధతిలో పరిశోధనలు జరిపించాలని, పరిశోధనలకు సంబంధించిన వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. విపతు వివరాలను అటవీ శాఖ డిప్యూటీ రేంజి ఆఫీసర్ అప్సరున్నీసను అడిగి తెలుసుకున్నామన్నారు. కార్యక్రమంలో తాడ్వాయి అడవులను సందర్శించిన వారిలో టీజెఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్, చేప బాబు, సాంబరాతి మల్లేశం, సోల్తి సాయికుమార్, రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

పర్వతగిరి, సెప్టెంబరు 8 : పర్వతగిరి అంబేడ్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడిగా జిల్లా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో 21ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ చింతపట్ల సురేందర్ రావు, ఎలక్షన్ ఆఫీసర్లు మహంకాళి రామస్వామి, భాస్కర్, సింగారపు రమేష్ తెలిపారు. అనంతరం పలువురు సభ్యులు నూతన అధ్యక్షుడిని సన్మానించారు.

నేటినుంచి గ్రామీణ వైద్యుల సేవలు బంద్

నెక్కొండ, సెప్టెంబరు 8 : ఈ నెల 9 నుంచి 12వ తేది వరకు గ్రామీణ వైద్యుల సేవలను బంద్‌చేస్తున్నట్లు మండల గ్రామీణ ఆదర్శ వైద్య సేవల సంఘం అధ్యక్షుడు కుడికాల కుమారస్వామి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్న గ్రామీణ ఆదర్శ వైద్యులపై టీజీఎంసీ, ప్రభుత్వ వైద్యాధికారుల దాడులకు నిరసనగా వైద్య సేవలను బంద్‌చేస్తున్నామని, ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

మాటుకుంటకు గండి



మాటుకుంటకు పడిన గండి

పర్వతగిరి, సెప్టెంబరు 8 : మండలంలోని జమాల్‌పురంలో మాటు కుంటకు గండి పడింది. గతంలో వర్షాలకు రెండుసార్లు గండ్లుపడగా అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. కుంట దిగువన 200ఎకరాల ఆయకట్టు ఉందని,ప్రస్తుతం కుంట కట్టకు గండిపడి నీళ్లన్నీ దిగువకు వెళ్లిపోయాయని రైతులు వాపో తున్నారు. ఆయకట్టు పొలాలకు సాగునీరు లేక ఇబ్బందులు పడు తున్నామని అన్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంవల్ల కట్ట తెగిన ప్రతీసారీ తూతూ మంత్రంగా మరమ్మతు పనులు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు చొరవ తీసుకుని శాశ్వత పనులను చేయించాలని స్థానికుడు జిల్లా కనకయ్య కోరాడు.

39 లీటర్ల గుడుంబా స్వాధీనం

ఖానాపురం, సెప్టెంబరు 8 : అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రఘుపతి ఆదివారం తెలిపారు. మంగళవారిపేట శివారులోని నాజీతండా క్రాస్‌రోడ్డు వద్ద అనుమానాస్పదంగాఉన్న ఇద్దరు వ్యక్తులు నాజీతండాకు చెందిన భూక్య గణేష్, బోడ సరోజన బ్యాగులను తనిఖీ చేయగా, గణేష్ వద్ద 16 గుడుంబా ప్యాకెట్లు, సరోజన వద్ద 10గుడుంబా ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. ఇద్దరివద్ద కలిపి సుమారు 39 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చెన్నారావుపేట, సెప్టెంబరు 8 : మండలంలోని ఉప్పరపల్లికి చెందిన కుక్కల మచ్చాలు అనే వ్యక్తి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి గ్రామస్థులు వ్యాపార వేత్తలు కలిసి రూ.60 వేలను ఆదివారం అందించారు. ఆర్థిక సాయంగా అందించిన వాటిలో బాధిత కుటుంబ సభ్యులు రమ్య, సింధూల పేర్లపై రూ.30 వేలను ఫిక్సిడ్ డిపాజిట్‌ల బాండ్‌లను అందించారు. పులి దేవేందర్, పరికి మధుకర్, శ్రీను, కర్ణాకర్‌రెడ్డి, స్వామి, కుమార్, అశోక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రోడ్డును నిర్మించాలి

రాయపర్తి, సెప్టెంబరు 8 : మండలంలోని సన్నూరు బాలునాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గోపియాతండా నుంచి దూదియా తండా వర కు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కొట్టుకుపోయిందని, ప్రభుత్వం వెంటనే రోడ్డును నిర్మించాలని స్థానిక గిరిజనులు డిమాండ్‌చేశారు. ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే గుర్తించి తాత్కాలిక రోడ్డైనాఏర్పాటు చేయాలన్నారు.

వర్షాలకు కూలిన ఇంటి గోడ

రాయపర్తి, సెప్టెంబరు 8 : మండలంలోని గట్టికల్లులో ఇటీవల కురుస్తున్న వర్షాలతో బొమ్మెర ఎల్లయ్య ఇంటి గోడ కూలిపోయింది. గోడ బయటి వైపు కూలడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. పెర్కవేడులో సైతం దేవసాని రజిత ఇల్లు వర్షానికి కూలడంతో బాధిత కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలు

పర్వతగిరి, సెప్టెంబరు 8 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలు నడుస్తున్నాయని, వాటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

బస్ డ్రైవర్ ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

గీసుగొండ, సెప్టెంబరు 8 : లోన్ డబ్బులు చెల్లించాలని బ్యాంకుఅధికారులు ఒత్తిడి చేయడంతో మనస్తాపం చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం రాత్రి మొగిలిచర్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మొగిలిచర్లకు చెందిన అల్లం శ్రీనివాస్(35)ప్రైవేటు పాఠశాల బస్ డ్రైవర్‌గాచేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ ఇంటిని తనఖా పెట్టి పలు ప్రైవేటు బ్యాంకుల్లో 2022లో లోన్‌లు తీసుకున్నాడు. ఇటీవల ఆయా బ్యాంకుల లోన్ డబ్బుచెల్లించాలని శ్రీనివాస్‌ను ఒత్తిడి చేయటంతో మన స్తాపంచెంది,శనివారం అర్ధరాత్రి విషగుళికలుమింగి మృతిచెందాడు. మృతుడిభార్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు.